www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 సెప్టెంబర్ 2025

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 1వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 1వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుశాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 1వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

శ్రీవారికి రూ.4.13 కోట్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారికి ఆదివారం భక్తులు విలువైన కానుకలు సమర్పిస్తున్నారు. తాజాగా టిటిడి భారీ విరాళం అందింది. ఆర్‌ఎస్‌బి రీటైల్ ఇండియా లిమిటెడ్ టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు సుమారు రూ. 2.93 కోట్లు విరాళం ఇచ్చింది. ఆర్‌ఎస్ బ్రదర్స్ జ్యువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ బర్డ్ ట్రస్ట్‌కు రూ.1.10 కోట్లు విరాళం ఇచ్చింది. ఈ విరాళాలకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్టలను ఆయా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌలి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారిలు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరిలకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అందజేశారు.

అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలు విరాళం..

ఈ విరాళాలతో పాటు నరసరావుపేటకు చెందిన భక్తుడు రామాంజనేయులు శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ భారీ విరాళాలు టీటీడీ చేపడుతున్న సామాజిక, ధార్మిక కార్యక్రమాలకు, ముఖ్యంగా బర్డ్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందించే వైద్య సేవలకు మరింత తోడ్పడనున్నాయి. గతంలో కూడా ఆర్‌ఎస్ బ్రదర్స్ సంస్థ టీటీడీ ట్రస్టులకు పలుమార్లు భారీ విరాళాలు అందజేసింది. ఇది శ్రీవారి భక్తుల ఆధ్యాత్మిక నిబద్ధత, సేవా భావాన్ని మరోసారి చాటి చెప్పింది.



టిటిడి ఛైర్మన్‌కు డిడిని అందిస్తున్న దాతలు

హైవేపై మృతదేహంతో ధర్నా

వెంటనే అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

హైవేపై ధర్నా

ప్రజాశక్తి- రొంపిచర్ల: మదనపల్లి- తిరుపతి హైవే రోడ్డులోని రొంపిచర్ల క్రాస్ వద్ద వెంటనే అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆదివారం నేషనల్ హైవేపై శనివారం రాత్రి కారు ఢీకొనడంతో మృతి చెందిన కూలి జయచంద్ర మృతదేహంతో రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టి ధర్నా చేశారు. జాతీయ రహదారిలోని రొంపిచర్ల క్రాస్ వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు దాటుతుండగా పలువురికి ప్రమాదాలు జరిగాయని స్థానికులు వాపోయారు. ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని నేషనల్ హైవే అధికారులకు, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి కూడా చల్లవారిపల్లెకు చెందిన రోజువారి కూలీ పని చేసుకునే జయచంద్ర రోడ్డు దాటుకుని ఇంటికి వెళుతుండగా, కారు ఢీకొని మృతి చెందాడని, నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించాలని, లేదా రోడ్డుకు 30 అడుగుల ఎత్తులో ఇనుప పైపులతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో రొంపిచర్ల ఎస్సై సుబ్బారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ధర్నాలు లాంటి కార్యక్రమాలు ఏవి చేయరాదని, ఏదైనా సమస్య ఉంటే కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ధర్నాను విరమించారు. సమస్య పరిష్కరించకుంటే మళ్లీ ధర్నాకు దిగుతామని ప్రజలు హెచ్చరించారు.

హైవేపై మృతదేహంతో ధర్నా

పోలీసులతో మాట్లాడుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

పిజిఆర్‌ఎస్ వాయిదా: కడా పీడీ

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 1వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్‌ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని బోడిపాటివారిపల్లి, పాతపేట గ్రామాలలోని పంట పొలాలపై ఆదివారం తెల్లవారు జామున 16 ఏనుగుల గుంపు దాడి చేయడంతో రైతులకు చెందిన పంటలు ధ్వంసం అయ్యాయి. గ్రామాలకు చెందిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రిజర్వు ఫారెస్ట్‌కు చెందిన గోగులమ్మ అటవీ ప్రాంతం నుంచి ఆదివారం వేకువ జామున బయలు దేరిన ఏనుగుల గుంపు మార్గమధ్యంలో ఉన్న వరి, కొబ్బరి, మామిడి చెట్లను తొక్కుకుంటూ పంటలను నాశనం చేశాయి. నష్టపోయిన రైతులు పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

వరి పంటను తొక్కి నాశనం చేసిన ఏనుగుల గుంపు

ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో రోజురోజుకి విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా కొత్తరకం దోమలు వలన రకరకాల జ్వరాలు వస్తున్నాయని ప్రజల ఆరోగ్యాలపై దృష్టి పెట్టి దోమల నివారించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రజలు వైరల్ జ్వరాలతోనూ రకరకాల పద్ధతిలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రామీణ స్థాయిలో 50 పీహెచ్‌సీలు ఉన్నప్పటికీ సరైన వైద్యసేవలు అందడం లేదు. కొంతమంది మెడికల్ ఆఫీసర్లు వారి సొంత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. స్థానికంగా లేకుండా ఎక్కడో సుదూర ప్రాంతం నుంచి వచ్చి వెళ్తున్నారే తప్ప ప్రత్యేక దృష్టి పెట్టడం లేదు. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లను ప్రజల సేవల నుంచి తప్పించి ఇతర పనులకు మళ్ళించడం సరైంది కాదన్నారు. వీటితో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు పోవాల్సిన పరిస్థితి వస్తున్నది. దీనిని సాకుగా చూసి ప్రైవేట్ ఆస్పత్రులు రకరకాల టెస్టులు పేరుతో వేలకు వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో ఆశ్రయిస్తున్నారని, ఇది ప్రైవేట్ ఆస్పత్రులకు పంట పండుతున్నదన్నారు. జిల్లా వైద్యాధికారులు ప్రజల ఆరోగ్యాలపై దృష్టి పెట్టకుండా రకరకాల పనుల్లో నిమగ్నమై ఉన్నారని జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో సమీక్షలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సిబ్బందిని వైద్య అధికారులు వేరే పనులకు ఉపయోగించు కుంటున్నారని అన్నారు. ప్రజలకు సేవలు అందడం లేదని, ప్రజారోగ్యాలపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందకపోవడంతో చిత్తూరు నగరంలో ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజలు వెళ్లి వేలకు వేలు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా వైద్యంపై దృష్టి పెడుతున్నామని చెప్తున్నా ఆచరణలో ఆ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. కొంతమంది అధికారుల వైఖరి వలన ఇది జరుగుతున్నదని ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు చొరవ చూపి జిల్లా ప్రజల ఆరోగ్య విషయంలో దృష్టి పెట్టి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు పంచాయతీలకు నిధులు ఇచ్చి పరిశుభ్రత విషయంలో దృష్టి పెట్టాలన్నారు. పరిశుభ్రత ఉంటేనే దోమల నివారణ అవుతుందని తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన మందులు సరఫరా చేసి పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడ దోమల నివారణ మందు వాడడం లేదని, ప్రస్తుత వాతావరణం వర్షాలు వల్ల భారీగా దోమలు ఉన్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను దోచేస్తున్న ఎరువుల దుకాణ యజమానులు

- యూరియా బస్తాకు అదనంగా రూ.100 వసూలు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి- శాంతిపురం

యూరియా డిమాండ్ రైతులకు శాపంగా మారింది. ఎరువుల దుకాణా దారులకు లాభంగా మారింది. తెలంగాణని తెలిపిస్తున్న శాంతిపురం మండల కేంద్రం సాగు చేసిన పంటలకు యూరియా వేసి పంట లాభాలు గడించాలని ఆశిస్తున్న రైతులకు శాంతిపురం మండలంలో ఎదురుదెబ్బ తగులుతుంది. ఎరువుల దుకాణ యాజమానులు డిమాండ్ ను బట్టి అదనంగా రూ.100 రైతుల నుంచి దోచేస్తున్నారు. యూరియా బస్తా రూ.250 నుంచి రూ.270ల లోపు అమ్మాల్సి ఉండగా శాంతిపురం మండలంలో ఏకంగా రూ.400లు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలో సుమారు 8 ఎరువుల దుకాణాలు ఉండగా అందులో నాలుగు ఎరువుల దుకాణాలకు మాత్రం ఆదివారం యూరియా లోడ్లు తెప్పించుకున్నారు. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. ఒక్కసారిగా భారీగా జనం రావడంతో అదే అదునుగా భావించిన యాజమానులు రూ.400లు ఇస్తేనే యూరియా బస్తా ఇస్తామని తేల్చి చెప్పారు. చేసేదేమీ లేక రైతులు వేసిన పంటలు కాపాడుకోవాలని రూ.400లు చెల్లించి యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. యూరియా తెప్పించుకున్న అన్ని దుకాణదారులు యాజమానులు ఇదే తంతును పాటించారు. దీంతో రైతులు రూ.400 చెల్లించి బస్తాలు కొనుగోలు చేశారు. సాయంత్రం యూరియా అయిపోయిందని యాజమాన్యం రైతులను వెనక్కి పంపించారు. కొంతమంది రైతులు డిమాండ్ ఉండడంతో యూరియా స్టాక్‌ను భద్రపరచి రెండు మూడు రోజుల తర్వాత మరింత అధిక ధరలు అమ్ముకోవడానికి యాజమానులు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. రైతులు యూరియా కోసం కష్టాలు పడుతుంటే సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆగ్రహం చేశారు. ఈ విషయంగా స్థానిక వ్యవసాయ అధికారి కిషోర్‌ను ఫోను ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించినా ఆయన స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ ధరకే యూరియా బస్తాలు రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

పిల్లలకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : లెర్న్ ఎక్స్ ఆర్ట్ కార్నివల్ - 2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం పీవీకేన్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు గీస్తున్న చిత్రాలను ఆసక్తిగా తిలకించి ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్సాహపరిచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలుకితీస్తూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ప్రముఖులు సౌమ్యారెడ్డి, లెర్నె ఎక్స్ ఆర్ట్ కార్నివల్ -2025 నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డీఆర్డీఎలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం పీవీకేఎన్ కళాశాలలో జరిగే జాబ్ మేళాలో టాప్ ఎంఎన్సీ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పాస్/ఫెయిల్ విద్యార్హతతో 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చున్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 84658 30771, 99635 61755 సంప్రదించవచ్చని తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలో ఇదివరకే రెండు దఫాలు జాబ్ మేళాలు నిర్వహించి సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగావకాశాలు పొందారన్నారు. జాబ్ మేళా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుండి కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు, ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్ నెల 2 నుంచి 7వ తేగీ వరకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించబడునని జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆయా తేదీలలో ఉదయం 6 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో (చిత్తూరు1వ పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన) హాజరు కావాలని తెలిపారు. మహిళా అభ్యర్థులకు సెప్టెంబర్ 2,3 తేదీల్లో, పురుష అభ్యర్థులకు 4 నుంచి7వ తేదీ వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు వారి హాల్ టికెట్స్ ప్రకారం కింద తెలిపిన తేదీలలో హాజరు కావాలన్నారు. 2వ తేదీ మహిళా అభ్యర్థులు హాల్ టికెట్ నెంబర్ 4002466 నుండి 4152206 వరకు 38 మంది. 3వ తేదీ హాల్ టికెట్ నెంబర్ 4155558 నుండి 4481787 వరకు 40 మంది. అలాగే పురుష అభ్యర్థులకు. 4వ తేదీ పురుష అభ్యర్థులు (సివిల్ అండ్ ఎపిఎస్పీ) హాల్ టికెట్ నెంబర్ 4004185 నుండి 4093554 వరకు 50 మంది. 5వ తేదీ హాల్ టికెట్ నెంబర్ 4094065 నుండి 4174863 వరకు 50 మంది. 6వ తేదీ హాల్ టికెట్ నెంబర్ 4179694 నుండి 4252641 వరకు 50 మంది. 7వ తేదీ హాల్ టికెట్ నెంబర్ 4254681 నుండి 4504895 వరకు 69 మంది. వైద్య పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమవెంట హాల్ టికెట్లు, ఆధార్ కార్డ్, కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు (2) తీసుకురావాలని తెలిపారు.

మహిళా పార్లమెంటేరియన్లకు తిరుపతి వేదిక

- 14,15 తేదీల్లో సమావేశాలు

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో: మహిళా పార్లమెంటేరియన్లకు తిరుపతి ఆహ్వానం పలకనుంది. 14,15 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మహిళలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతిలో పది రోజుల క్రితం అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురాం రాజులు స్థల పరిశీలన చేశారు. తిరుపతి, తారకరామ స్టేడియం వేదిక కానున్నట్లు సమాచారం. 14వ తేదీ జరిగే సమావేశానికి పార్లమెంటు స్పీకర్ ఓమ్ బిర్లా, సీఎం చంద్రబాబులు హాజరుకానున్నారు. ఆఖరి రోజు 15వ తేదీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై ప్రసంగిస్తారు. తొలిరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో మహిళా ప్రజాప్రతిదుల ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల విజయవంతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సోమవారం నుంచి వేదిక ఏర్పాట్లు, మహిళ ప్రజాప్రతినిధులకు వసతి సౌకర్యాలపై చర్చించుకున్నారు. తిరుపతిలో ప్రైవేటు హోటల్స్ అన్ని బుక్ చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అలాగే మహిళా ప్రజా ప్రతినిధులకు శ్రీవారి దర్శనం ఏర్పాట్లు కూడా టిటిడి పాలకమండలి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలతో కలిసి మాట్లాడనున్నారు.

ఉపాధి హామీలో మోసాలకు చెక్

- నూతనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్ అమలు
- ప్రజాశక్తితో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాల కల్పనతో పాటుగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నామని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక సూచనలతో తిరుపతి జిల్లాల్లో రైతాంగానికి మేలు చేకూర్చేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో కూలీలకు పని దినాల కల్పన, పల్లె పండుగ అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్రం నుండి రావలసిన బకాయిలు వంటి విషయాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో పిడి వివరించారు.

ప్రజాశక్తి: ఉపాధి హామీ పథకంలో ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా తీసుకుంటున్న చర్యలను వివరించండి?

పిడి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో ఎటువంటి అవినీతి జరగకుండా నూతనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకువచ్చి ఎన్ఐసి 2.0 లో భాగంగా ప్రతి పనిని ముందు, ప్రస్తుతం, తరువాత లాగా క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు సంబంధించి ఫోటోలను అప్లోడ్ చేయడం జరుగుతోంది. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి వచ్చే వారం నుండి అమలుకు శ్రీకారం చుట్టాము.

ప్రజాశక్తి: పల్లె పండుగ కార్యక్రమానికి సంబంధించి బకాయిలు చెల్లించడం జరిగిందా?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో పల్లె పండుగ ద్వారా జరిగిన కార్యక్రమాలకు దాదాపుగా అన్నింటికీ బిల్లులు చెల్లించడం జరిగింది. రూ.62 కోట్ల బకాయిలు ఉంటే అందులో రూ.30 కోట్లు ఇప్పటికే లబ్ధిదారులకు చేరేందని, టెక్నికల్ కారణాల ద్వారా ఆగిన మరో రూ.32 కోట్ల రూపాయలు త్వరలో కేంద్రం నుండి విడుదల కానున్నాయి. పెండింగ్లో ఉన్న రూ. 34 కోట్ల రూపాయలకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్పర్స్ విధానం ద్వారా ఈ పేమెంట్ విధానం జరుగుతోంది.

ప్రజాశక్తి: గత వైసిపి ప్రభుత్వ హాయంలో ఉపాధి హామీ నిధులను దారి మళ్ళించారని విమర్శలు ఉన్నాయి?

పిడి: గత ప్రభుత్వ హాయంలో విత్ హెల్డ్ పేమెంట్స్ ఉండేవి. రాష్ట్రవ్యాప్తంగా 34 కోట్లు ఉండగా తిరుపతి జిల్లాకు సంబంధించి రెండు కోట్ల విత్ హెల్డ్ పేమెంట్స్ ఉన్నాయి. అవి ప్రస్తుతం చెల్లించబడ్డాయి.

ప్రజాశక్తి: తిరుపతి జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పేమెంట్లు సకాలంలో జరగడం లేదు. దానికి గల కారణాలు తెలపండి?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో 12 వారాలకు సంబంధించిన పని దినాల బకాయిలు ఉన్నాయి. బకాయి ఉన్న మొత్తాన్ని కూడా వారం.. వారం పని దినాల సంఖ్యను బట్టి అప్లోడ్ చేయడం జరుగుతుంది. అయితే కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా ఉపాధి హామీ కూలీలకు వారి ఖాతాలోని జమ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కేంద్రం నుండి వారి పని దినాలు, సమయాలు, హాజరును మాత్రమే నమోదు చేయడం జరుగుతోంది. త్వరలో ఉపాధి హామీ కూలీలకు బకాయి ఉన్న రూ. 25 కోట్ల రూపాయలు వారి ఖాతాలకు బదిలీ కాబడతాయి.

ప్రజాశక్తి: ప్రారంభమైన ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించండి?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి నేటికీ 53 లక్షల పని దినాలను కల్పించాం. ఇందుకుగాను కూలీలకు రూ.150 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగింది. ఉపాధి హామీ నిధులతో రైతులకు మేలు చేకూర్చేలా ప్రత్యేక ప్రణాళికగా హార్టికల్చర్ విభాగం సహకారంతో 1000 ఎకరాల్లో పండ్ల తోటలను నాటడం జరిగింది. 2100 ఫారం పాండ్స్ ఇచ్చాము. గత ఆర్థిక సంవత్సరానికి 1500 మినీ గోకులాలు ఇస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో 1000 గోకులాలు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను కేటాయించాం.

కుప్పం నర్సింగ్ కాలేజీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నర్సింగ్ కాలేజీలో స్నాతకోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా బెంగళూరు విజయనగర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ వసంత సింగరాయన్ పాల్గొన్నారు. కళాశాల చైర్‌పర్సన్ ఎన్.శాంతా నాగరాజు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వసంత సింగరాయన్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభతో పాటు ఉత్తమ సేవా ప్రధానం ప్రస్తుత సాంకేతిక పరంగా అవగాహన కలిగి ఉత్తమ సేవకు ప్రయత్నం చేయలని విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల ఛైర్మన్ బిసి నాగరాజు మాట్లాడుతూ కాలేజీలు విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ పట్టా పొందడమే కాక 11 మంది డిస్టింక్షన్ సాధించడం చాలా గర్వకారణం అన్నారు. 2025 సంవత్సరంలో జరిగిన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కాలేజీని ఎంచుకున్నప్పుడే విజయానికి తొలిమెట్టు అని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ సాగర్ రాజు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ మహాప్రస్థానంపై చర్చాగోష్టి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ శతాబ్దం నాది అన్న శ్రీరంగం శ్రీనివాసరావు మహాప్రస్థానం పుస్తకం రాసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయి తల సంఘం, ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, బైరాగిపట్టెడ, గంధమనేని శివయ్య భవనం, గ్రంథాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్నల ఆధ్వర్యంలో మహా ప్రస్థానంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతి థిగా అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ హాజరై నేటి సమాజ స్థితిగతులను గురించి శ్రీశ్రీ ఆనాడే అక్షరరూపం ఇచ్చారని, చైతన్య వంతమైన సమాజాన్ని చూడాలని రచనలు చేశారని తెలిపారు. తిరుప తి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో శ్రీ శ్రీ గీతాలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ శ్రమైక జీవన సౌందర్యాన్ని శ్రీ శ్రీ రచనల్లో రాశారన్నారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన వేదిక అధ్యక్షులు మల్లా రపు నాగార్జున, పేరూరు బాలసుబ్రమణ్యం, నడ్డి నారాయణ, విశ్వనాథ్ రెడ్డి, గాయకులు కడివేటి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాట్లు ఆగేదెన్నడూ?

- ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- చిత్తశుద్ధి కరువు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో శునకాల బెడద అధికమవుతోంది.. స్థానికులపై, ప్రయాణికులపై కుక్కల గుంపు దాడి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కుక్క కాటుకు గురవుతున్న బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. బాధితులు వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆయా పంచాయతీల్లో కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో కుక్క కాట్లకు గురి కావాల్సి వస్తోందని, దీనిపై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కకాట్లు ఆగేదెన్నడూ?

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ఇటు పక్క రాష్ట్రమైన తమిళనాడు, నుంచి కార్వేటి నగరం మండలం, వెదురుకుప్పం మండలం మీదుగా పచ్చికాపల్లం ప్రధాన మార్గంగా తిరుపతి, తిరుమలకి , ఇటు భక్తులు, అటు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి రైతులు వెళుతుంటారు. ఆ గ్రామంలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా చేరి, వాహన దారులపై, పాఠశాలలపై దాడికి పాల్పడుతున్నాయి. వారి బాధ వర్ణనాతీతం అని స్థానికులు చెబుతున్నారు.

ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు

వెదురుకుప్పం మండల పరిధిలో పచ్చికాపల్లంలో ఊర కుక్కల గుంపులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. స్థానికులపై, ప్రయాణికులపై అవి రోజూ దాడి చేస్తున్నాయి. వీటి బారిన పడిన వారు పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇచ్చిన గడువు ప్రకారం సూదులు వేసుకుంటున్నారు. గత ఆగస్టు నెలలో సుమారు 32 మంది కుక్కల దాడిలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి.

చిత్తశుద్ధి కరువు

కుక్క కాట్లుపై పలుమార్లు ఎంపీడీవోకు స్థానికులు చెప్పినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. బాధితుల బాధ అధికారులకు అర్థం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఉన్నత న్యాయస్థానం కుక్కల బెడద నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించినా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామసభలలో లిఖితపూర్వకంగా స్థానికులు అర్జీలు ఇచ్చినా పట్టించుకోరని చెబుతున్నారు. గత సంవత్సరం మాంబేడు గ్రామంలో పిచ్చికుక్క ఒకే రోజు ఐదు పాడి ఆవులు, ఒక లేగ దూడపై దాడి చేసి గాయపరిచింది. నాలుగు పాడి ఆవులు అదే రోజు సాయంత్రం మృతి చెందాయి. లేగ దూడ మాత్రం స్థానికంగా ఉన్న గోపాలమిత్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. పాడి ఆవులు మృతి చెందడంతో ఆ రైతులు ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రహదారులపై సంచరిస్తున్న శునకాలు

చర్యలు తీసుకోవాలి

కుక్కల బెడద నివారణకు వాటి సంతతి పెరగకుండా శస్త్ర చికిత్సలు తీసుకోవడం, వీధుల్లో కుక్కలను పట్టి సంరక్షణ కేంద్రాలకు తరలించడం వంటివి చేయాల్సి వుంది. అయితే మండల పరిధిలో మండల అధికారులు కాని, పంచాయతీల పరిధిలో పంచాయతీల అధికారులు కాని అలాంటి చర్యలు ఏవీ తీసుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- స్థానికులను కుక్క కరిచిన వెంటనే వేడి నీళ్లతో సబ్బుతో గాయపడిన దగ్గర శుభ్రంగా కడగాలి.
- స్థానికంగా ఉన్న ఆస్పత్రికి వచ్చి ప్రాథమిక చికిత్స చేయించుకోవాలి.
- మనిషికి నాటు వైద్యం చేయరాదు. గాయానికి పనస పాలు పెట్టడం, కట్టు కట్టడం ఇలాంటి పనులు చేయ కూడదు.
- వర్షంలో తడవకూడదు.. మద్యం, మాంసం తీసుకోకూడదు.
- వైద్యాధికారులు సూచించిన మేరకు సూదులు వేసుకోవాలి. - తగు జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వుండవచ్చు.

- కృష్ణ చైతన్య, పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి.

క్రైం న్యూస్

దొంగ అరెస్టు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తాళం వేసిన ఇళ్లలో బంగారం, నగదును దొంగతనం చేసే ఓ వ్యక్తిని ఎన్ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేసి సుమారు రూ 10 లక్షల 35 వేల రూపాయల విలువ చేసే 109 గ్రాముల బంగారు ఆభరణాలు, 42 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. అదుపులోకి తీసుకున్న దొంగను ఆదివారం స్థానిక పోలీస్ అతిథి గృహంలో ఎస్పీ మీడియా సమావేశం ఎదుట ప్రవేశపెట్టారు. తమిళనాడులోని రాణిపేట జిల్లా, షోలింగర్ తాలూకా, సోమసముద్రం గ్రామానికి చెందిన డ్రైవరుగా పనిచేస్తున్న ప్రశాంత్‌ను నిందితుడిగా గుర్తించారు. ఇతనిపై ఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో పలు దొంగతనం కేసులు నమోదై వున్నాయన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ టి సాయినాథ్, చిత్తూరు రూరల్ ఈస్ట్ సిఐ జి నిత్యబాబు ఆధ్వర్యంలో, ఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగ సౌజన్య, చిత్తూరు తాలుకా స్టేషన్ ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ క్రమంలో సాంకేతిక ఆధారాలతో ఎన్ఆర్‌పేట ఎంఎస్ చెక్ పోస్టు వద్ద నిందితుడు ప్రశాంత్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో పెనుమూరులో, 2025వ సంవత్సరంలో చిత్తూరు తాలూకా పరిధిలో, గత నెల ఎన్ఆర్‌పేట పరిధిలో దొంగతనానికి పాల్పడినట్లు నిందితుడు నేరం అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద వున్న మూడు కేసులకు సంబంధించి సుమారు 109 గ్రాముల బంగారు ఆభరణాలు, 42 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఒంటరిగా వాకింగ్ చేసే మహిళల మెడలోని బంగారు ఆభరణాల దొంగతనానికి పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన అంసాయాసన్, మహమ్మద్ పీతా, ఎ పీతా, ఎ పిదా, అంజాద్‌ను వన్ టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుండి సుమారు 20 లక్షలు విలువ చేసే 192 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 లక్షలు విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితులపై చిత్తూరు ఒన్ టౌన్ పరిధిలో నాలుగు కేసులు, చిత్తూరు తాలూకా స్టేషన్ పరిధిలో ఒకటి, పుంగనూరు స్టేషన్ పరిధిలో ఒకటి, వి కోట స్టేషన్ పరిధిలో ఒకటి, మదనపల్లి ఒన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, మొత్తం 8 కేసులు ఉన్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనంలో తిరుగుతూ మహిళల మెడ లోని బంగారు చైన్‌లను లాక్కొని వెళుతున్న చైన్ స్నాచింగ్ సంఘటనలపై కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారన్నారు. చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్పీ టి సాయినాథ్ అధ్వర్యంలో చిత్తూరు 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు, గంగవరం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ , వి కోట ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి సిబ్బందితో పలు బృందాలుగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రాంతాలలో ముమ్మర దర్యాప్తు చేపట్టారన్నారు. ఆదివారం తెల్లవారు జామున చిత్తూరు చామంతిపురం రిలయన్స్ మార్ట్ సమీపంలో నిందితులను పట్టుకుని వారి నుండి అపహరించిన సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 192 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 3 లక్షలు విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి -యాదమరి: విద్యుత్ షాక్ తో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం యాదమరి మండలంలోని నూర్ నగర్ లో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు ఎస్ కలంధర్, జబ్బార్ సాహెబ్, నివాసం నూర్ ఈ నగర్ గ్రామం, తన భార్య ఎస్. అరిఫా (40) ఇంట్లో నీటి మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న సమయంలో ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే డ్యూటీ డాక్టర్ ఆమెను ఆసుపత్రికి తీసుకు వచ్చే లోపు మరణించినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఫిర్యాదుదారు యాదమరి పోలీస్ స్టేషన్‌లో 84/2025, సెక్షన్ కింద యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలు అదృశ్యం

అదృశ్యమైన పిల్లలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - యాదమరి: హోప్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని నిర్వాహకులు గ్లాడిన్ యాదమరి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని యాదమరి ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు. చిత్తూరు జిల్లాలోని ఎన్ ఆర్ పేట సమీపంలో హరి అనే ఓ బాతులు మేపే వ్యక్తి దగ్గర ఇద్దరు బాలురు ఉన్నారని వారిని హరి అనే వ్యక్తి గార్డియన్‌గా చూసుకుంటున్నాడని, వారు శక్తి వేలు(12), చిన్నారుసు (10) తమిళనాడులో పొన్నయి దగ్గర తిరుగుతుండగా, తమిళనాడు పోలీసులు విచారించి ఎన్ఆర్‌పేట పోలీసులకు తెలిపారన్నారు. ఎన్ ఆర్ పేట పోలీసులు విచారించి, హరి అనే వ్యక్తి దగ్గర గతంలో ఉన్నారని తెలుసుకొని సిడబ్ల్యూసి అధికారులు సమక్షంలో ఆ పిల్లలు ఇద్దరిని యాదమరి మండల పరిధిలోని, పుల్లయ్య గారి పల్లి దగ్గర గల హోప్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఆగస్టు 14వ తేదీన ఉంచారని తెలిపా రు. ఆ పిల్లలిద్దరూ 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటల నుండి కనిపించలేదని ఈ విషయమై హాస్టలు సిబ్బంది, చుట్టుపక్కలా వెతికినా దొరక్కపోవడంతో చిల్డ్రన్స్ హోమ్ ఇన్‌ఛార్జి గాడ్లిన్ ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. ఆ పిల్లల ఆచూకీ తెలిపి పోలీసులకు సహకరించాలని పోలీసులు తెలిపారు. ఏదైనా సమాచారం తెలిస్తే యాదమరి ఎస్ఐ ఈశ్వర్ 9440900684 ఫోను నెంబరుకు తెలపాలని పేర్కొన్నారు.

అశ్లీల నృత్యాలపై కఠిన చర్యలు: డిఎస్‌పి

ప్రజాశక్తి - పలమనేరు: మండలంలో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి డేగల ప్రభాకర్ ఆదివారం పేర్కొన్నారు. పలమనేరు టీ వడ్డూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి మండ పంలో శనివారం రాత్రి తమిళనాడు నుండి పిలిపించిన ఐదుగురు మహిళలచే డాన్స్ ప్రోగ్రాం పెట్టించారు. అది మోతాదు మించి అశ్లీల నృత్యాలుగా మారింది. యువత నృత్యం చేస్తున్న మహిళలతో పాటు డాన్సులు చేశారు. ఈ ఘటన ఆదివారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. వినాయక చవితి ముందు రోజు డిఎస్‌పి డేగల ప్రభాకర్, ఆర్డీవో ప్రెస్ మీట్ ద్వారా వినాయక విగ్రహాల ముందు రికార్డింగ్ డాన్సులు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కానీ ఇక్కడ నిర్వాహకులు మాత్రం అవేవీ పట్టనట్టు మహిళలచే నృత్యాలు చేయడం పోలీసులు ఆదేశాలు బేఖాతరు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిర్వాహకులపై కేసు నమోదు చేశామని కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలిపారు.

సర్పంచ్ యల్లప్పకు డాక్టరేట్

గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం శెట్టిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ యల్లప్పకు అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. యల్లప్ప శెట్టిపల్లి గ్రామ పంచాయతీలో సోషల్ సర్వీస్, మండలంలోనూ సోషల్ యాక్టివిటీస్ చేయడంతో దీన్ని గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ వాళ్లు గౌరవప్రద డాక్టరేట్‌ను ప్రదానం చేశారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ గౌరవ డాక్టరేట్ హోసూరు ఐటిసి హోటల్‌లో ప్రదానం చేశారని ఆయన పేర్కొన్నారు. అమెరికన్ యూనివర్సిటీ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన సేవా కార్యక్రమాలను సోషల్ సర్వీసును కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కమ్మ వంశస్థుల శేష వాహన సేవ, కళశాల ఊరేగింపులో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె దీపా వెంకట్ తో కలిసి కలశాలతో ఊరేగింపు నిర్వహించి, ఆలయంలో అభిషేక సేవలో పాల్గొన్నారు. శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు.

వైసిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం: మండలంలోని తయ్యూరు పంచాయతీ బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నరసింహులు నాయుడుని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి వీరాభిమాని అని, వైసిపి ఆవిర్భావం నుంచి తనదైన శైలిలో పార్టీని ముందుకు నడిపించిన నరసింహనాయుడు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో మంచం పట్టారు. పరిస్థితి పూర్తిగా విషమించడంతో సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి నరసింహనాయుడు ఆయన గృహానికి వెళ్లి చూశారు. ఆయన పరిస్థితి చూసే ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం నరసింహం నాయుడు కుమారుడు వెంకటరత్నంకు ధైర్యం చెప్పారు. నరసింహనాయుడు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు .ఈ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు మణి, తయ్యూరు సర్పంచ్ మణి, శ్రీరంగరాజపురం సర్పంచ్ హరిత కుప్పయ్య, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి కొత్తపల్లి సాము, కటిక పల్లి మణి, జనార్ధన్ హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

దళితులపై దాడులు సహించేది లేదు..

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : దళిత కుటుంబాలపై అగ్ర కులాల దాడులు సహిం చేది లేదని కూటమి ప్రభు త్వం లో దళితుల అభివృద్ధి కాలేక పోతున్నాడని దాడులు చేస్తున్నారని దళితులకు అండగా ఉంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి వైసిపి నేత కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో పేద దళిత మహిళ వళ్ళమ్మ పూరి పాక పీకేస్తా మని దాడి జరిగినట్లు వచ్చిన వార్తలకు స్పందిస్తూ ఆదివారం ఉదయం ఎస్ఆర్ పురం మండల కేంద్రంలోని వల్లమ్మ పూరిపాక వద్దకు వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం తో రిజర్వేషన్ ప్రాతిపదికన అధికారంలోకి అధికారంలోకి వచ్చిన నాయకుల సైతం దళితుల కు న్యాయం చేయాలని వీరి పూరి పాకలను తొలగించ కూడదని వివాదాస్పదం లేని స్థలంలో శ్మశానానికి కేటాయించాలన్నారు. ఆ ప్రదేశం లో ఉన్న పూరిపాకలను పరిశీలించారు. అక్కడ ఉన్న చర్చిని సందర్శించారు . వీటిని వదిలి మిగిలే స్థలంలో శ్మశానం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు మణి, స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, నాయకులు జనార్ధన్, బాబు, హరి ప్రసాద్ రెడ్డి ,కొత్తపల్లి సాము , సర్పంచ్ బాబు, ఉడమలకుర్తి సర్పంచ్ చిట్టి మహేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు ఎంపీ కార్యాలయం ప్రజలతో కిక్కిరిసింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ప్రజలు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును కలిసి తమ విన్నపాలను విన్నవించుకునేందుకు క్యూ కట్టారు. వినతిపత్రాలను ఎంపీ దగ్గుమళ్ళకు అందించి , తమ కష్టాలను చెప్పుకున్నారు. సానుకూలంగా స్పందించిందిన ఎంపీ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి ఇబ్బందులను తెలుసుకుని పరిష్కారం చూపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయడం సంతృప్తిగా ఉందని ఎంపీ తెలిపారు.

మహిళలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -పుంగనూరు: అక్షరాస్యత లేని సమయంలో సమాజ మార్పు కోసం మా తల్లి కంజుల నాగమ్మ ఆ రోజుల్లోనే కృషి చేసిందని విశ్రాంతి ప్రొఫెసర్, పరివర్తన సంస్థ వ్యవస్థాపకులు గాంధీ వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని అడవినాథ కుంట గ్రామంలో ఆయన తల్లి 9వ వర్ధంతి సందర్భంగా పేదలకు, వృద్ధులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లి అప్పుడే కుల మతాలు లేకుండా సమాజ మార్పు కోసం కృషి చేసిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పట్లో ఎస్సీలు సర్కారు బావుల్లో నీళ్ల తీసుకోవడం కూడా ఆమె కృషితోనే జరిగిందన్నారు. అడివి నాదకుంట ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న ఆమె కోరిక మేరకు మోడల్ స్కూల్స్, ఆదర్శ స్కూల్ కూడా తీసుకొ చ్చారన్నారు. ప్రొఫెసర్ వెంకట్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయ రామిరెడ్డి, రామకృష్ణ శంకర్ రెడ్డి, జి శంకర్ రెడ్డి, సుదర్శన్ చౌడేపల్లి అంబేద్కర్ భవన్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్యాంకు రెడ్డప్ప, భాస్కర్ రెడ్డి, పద్మసుభాష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

డివిపి క్రికెట్ టోర్నమెంట్ విజేత పెద్దతయ్యూరు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ దళవాయిపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న డివిపి క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ మండలాల నుంచి 21 టీంలు పాల్గొన్నాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్లో పెద్దతయ్యూరు క్రికెట్ టీం మొదటి బహుమతి రూ. 50 వేలు గెలుపొందగా, చిన్నతయ్యూరు క్రికెట్ టీం రెండవ బహుమతి రూ.30 వేలు గెలుపొందారు. నగదుతో పాటు ట్రోఫీ కప్ లను స్థానిక క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ల తో కలిసి జిల్లా టిడిపి తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి , ముఖ్య అతిథిగా పాల్గొని దేవపత్ని ధనంజయ నాయుడు చేతుల మీదుగా క్రికెట్ టీమ్ ల వారికి అందించారు. దళవాయిపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది బ్యాట్స్ మాన్ గా రాణించినందుకు రూ.3వేలు, పాపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన శశి కుమార్ మ్యాన్ ఆఫ్ ది బౌలర్ రాణించినందుకు రూ.3వేలును ఆర్గనైజర్స్ అందించారు. కాగా ఈ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులకు టీ షర్టు అదేవిధంగా టోర్నమెంట్లో విజేతలకు అందజేసిన ట్రోఫీ కప్ లను దాత టిడిపి నేత దేవపత్ని ధనుంజయ నాయుడు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిపి క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు ప్రకాష్ రెడ్డి ,రాజేందర్ రెడ్డి ,వెంకటేష్ రెడ్డి , డిల్లీ బాబు, ఎస్.ప్రకాష్ రెడ్డి, సురేష్ రెడ్డి, సతీష్ బాబు, దేవదాస్, అమాసయ్య పాల్గొన్నారు.

'హంద్రీ-నీవా'లో పడి యువకుడి మృతి

చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రమాద వశాత్తు హంద్రీ- నీవా కాలువలోపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం తావడకుప్పం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (27) దురదృష్టవశాత్తు హంద్రీ-నీవా కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి హంద్రీ-నీవా కాలువ వద్దకు వెళ్లి స్నానం చేయడానికి ప్రయత్నించాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పాటు ప్రమాదకరమైన మలుపు వద్ద జారిపడిన చంద్రశేఖర్ నీటిలో కొట్టుకుపోయి ఊపిరాడక మృతి చెందాడని తెలిపారు.ఈ సంఘటన చూసిన స్నేహితులు కేకలు వేయగా, స్థానికులు సహాయం చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో చంద్రశేఖర్ కాలువలో కొట్టుకెళ్లి గడ్డురు గ్రామం వద్ద స్థానికులు పట్టుకొని కాలువ నుండి వెలికి తీసి స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా డాక్టర్ విజయచంద్ర పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఇతను గతంలో వాలంటీర్‌గా పనిచేసినట్లు సమాచారం. ఈ ఘటనతో తావడకుప్పం గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. ప్రమాదవశాత్తు చనిపోయిన చంద్రశేఖర్‌కు ప్రభుత్వ వారు ఆర్థిక సహాయం అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలశాభిషేకంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి మాడవీధుల్లో బంగారు చిన్న శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు కలశాలను తీసుకెళ్లి ఊరేగింపులో పాల్గొన్నారు. తరువాత ఆలయంలో కళ్యాణ వేదిక వద్ద. నిర్వహించిన క్షీర కలశాభిషేకంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. ఆలయ ఈవో పెంచల కిషోర్ గారి సమక్షంలో పండితులు కలశాలను స్వీకరించి కళ్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారికి శాస్త్రోక్తం గా తేనే, నెయ్యి, పాలు, పెరుగు, సుగంధ ద్రవ్య పరిమ ళాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ అధికారులు, ఉభయ దారులు, పాల్గొన్నారు.

కలశాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టిడిపి నేత ఇంట్లో బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు నియోజకవర్గం పలమనేరు పట్టణం రాధా బంగ్లా కాలనీలో ఉంటున్న టిడిపి నాయకుడు రామ్మూర్తి నాయుడు ఇంట్లో ఆదివారం భారీ చోరీ చోటు చేసుకుంది. ఆయన కుమార్తె సౌజన్య కథనం మేరకు. సొంత పనుల నిమిత్తం బెంగళూరుకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటికి చేరుకోగా ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నారని, ఇంట్లో ఉన్న సుమారు 600 గ్రాముల బంగారు నగలు దొంగలు అపహరించుకుని వెళ్లారన్నారు. వీటి విలువ సుమారు 70 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సమాచారం అందుకున్న డిఎస్పీ డేగల ప్రభాకర్, సిఐ మురళీమోహన్ ఎస్ఐ లోకేష్ రెడ్డిలు ఘటన ప్రాంతానికి చేరుకొని చిత్తూరు నుండి క్లూస్ టీం రప్పించి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ మాట్లాడుతూ ఘటనపై కేసు నమోదు చేసి ముమ్మురంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంత చోరీ జరిగిందీ దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రంలో వివిధ వీధులలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ ఆదివారం ఊరేగించి నిమజ్జనం చేశారు. శివాలయం శెట్టి వారి వీధి కొత్తపేట పీర్లచావిడి జామ చెట్టు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్ల పై ఊరేగించి యువకులు ఉత్సాహంగా చిందులు వేస్తూ కోలాహలంగా ఊరేగించి అనంతరం చెరువులలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ శివశంకర్ పదిమంది పోలీసులు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

సోమలలో

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత కలిసి వినాయక విగ్రహానికి పూజలు చేసి ఊరేగింపుతో విగ్రహాన్ని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక యూత్ లీడర్ శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని 21 పంచాయతీలలోనూ వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.

బైరెడ్డిపల్లిలో

రొంపిచర్ల: రొంపిచర్ల మండలంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాలను ఆదివారం పురవీధులలో ఊరేగించి బ్యాండ్ మేళాలతో స్థానిక చెరువులో ఘనంగా నిమజ్జనం చేశారు. పలు వీధుల్లోని విగ్రహాలను తీసుకెళ్లి జమ్ము చెరువులో నిమజ్జనం చేశారు. ప్రజలకు స్వామి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వల్లెమ్మకు కూటమి ప్రభుత్వం అండ

జనసేన ఇన్‌ఛార్జి యుగంధర్ పొన్న

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గం, ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో 30 సంవత్సరాలుగా వుంటున్న నిరుపేద దళిత కుటుంబానికి చెందిన వల్లెమ్మను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసి, విశేషమైన అనుభవం గడించి, ఐదు సంవత్సరాలు ఉప ముఖ్యమంత్రిగా, ఎక్సైజ్ శాఖ, , కమర్షియల్ టాక్స్ మంత్రి గా పనిచేసిన నారాయణ స్వామికి వల్లెమ్మ కుటుం బం ఇంత వరకు కనపడక పోగా ప్రస్తుతం దళితు రాలికి అన్యాయం జరిగిం దని మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశా రు. బాధితురాలికి అక్టోబర్ రెండవ తేదీన కూటమి ప్రభుత్వం తరఫున మేమే స్వయంగా వల్లెమ్మకు ఒక ఇల్లు కట్టిస్తామని సవాల్ విసిరారు. ఇకపై వైసిపి అనవసర రాద్ధాంతాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

పల్లె ప్రజలు నవజీవన చైతన్యానికి ప్రతిరూపాలు

జానపద కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పల్లె ప్రజలు నవ జీవన చైతన్యానికి ప్రతిరూపాలు అని పలువురు పేర్కొన్నారు. మన సంస్కృతి కళా సంస్థ తిరుపతి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు మాసం (ప్రపంచ జానపద దినోత్సవం (22-08-2025)న జానపద మాసోత్సవంగా ప్రకటించి ఆగస్టు ఒకటవ తేదీ కాణిపాక వరసిద్ధి ఆలయ ప్రాంగణంలో ప్రారంభించి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అనేక ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో, ప్రముఖ గ్రామాల కూడళ్లలో, గ్రామ చావడులో, పల్లె ప్రాంతాల్లోని 28 వేదికలలో జానపద కళల గురించి పాటలు గురించి విద్యార్థులకు జానపద కళలను సంస్కృతిని పరిరక్షించుకుందామని, జానపద కళలు నవజీవన చైతన్యానికి ప్రతి రూపాలని, శ్రమైక జీవన సౌందర్యాలని మన సంస్కృతి కళాసంస్థ అధ్యక్ష కార్యదర్శుల సహదేవ నాయుడు కలకట రెడ్డెప్ప విద్యార్థులకు, ఉపాధ్యాయు లకు జానపద కళల అవగాహన పాటల పరిచయం విస్తృతంగా ప్రచారం చేశారు. విజయవంతంగా జానపద మాసవత్సం ముగించింది. ఆదివారం విజయం డిగ్రీ కళాశాలలో జానపద మాసోత్సవ ముగింపు కార్యక్రమం సంస్థ అధ్యక్షులు సహదేవ నాయుడు అధ్యక్షతన సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత్రి యం ఆర్ అరుణకుమారి హాజరై పల్లె పదాలు, జానపద కళలు పాటలు పల్లె ప్రజలకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గాయకులు రంజని, లత పూసల నరసింహులు, అనంత్ కుమార్, చిరంజీవి, పూల మనోహర్, గాయకులు హాజరై జానపద పాటలతో అందరినీ అలరించారు. ఆ సంస్థ తరఫున గాయని, గాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

రామకుప్పంలో

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల వద్ద ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులు ప్రజా ప్రతినిధులు, నాయకులు పంపిణీ చేశారు. ఎస్ గొల్లపల్లి, ఆనిగనూరు, రామకుప్పం గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రజా పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రానున్న రోజుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో నిత్యవసర సరుకులు పంపిణీ చేయనున్నారన్నారు. చౌక దుకాణాల్లో వృద్ధులకు వేలిముద్ర రాకపోయినా క్యూఆర్ కోడ్ ద్వారా సరుకులు అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాత్, సీతాపతి, రామ్మూర్తి, గురప్ప, కృష్ణా రెడ్డి, శుభాష్, గంట్లప్ప గౌడు, అప్పాలా, చంద్రారెడ్డి, టి వి రవి, విజయ్ రెడ్డి, సుబ్రీ, ఆదిల్, బాలు , అల్లి శీన, మంజునాథ్, బాబు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలం జొన్నగురకల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, వీఆర్వో ప్రకాష్, మధు కుమార్, రామచంద్ర, డీలర్ శాంత సుబ్బారెడ్డి టిడిపి కార్యకర్తలు, రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ రేషన్ సరఫరాలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు స్మార్ట్ కార్డ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పెన్షన్ విషయంలో అర్హులైన వారందరికీ తగిన విధంగా పించను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు.



తవణంపల్లిలో

కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం పి హెచ్ సి వద్ద ఆదివారం నిర్వహించిన కేన్సర్ వైద్య పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించిందని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా బసవతారక కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. మండలంలోని ప్రజలకు ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. మండలం లోని వివిధ గ్రామాలనుండి 316 మంది రోగులు హాజరుకాగా వారికి పరీక్షలు నిర్వహించి 35 మందిని రిఫర్ చేశారు. క్యాన్సర్ శిబిరాన్ని నిర్వహించిన వైద్యులకు ప్రజా ప్రతినిధులు, టిడిపి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలాం సాబ్, వెంకటరమణ, రాజసింహ,టీవీ రవి, విజయ్ రెడ్డి, ఆంజనేయప్ప, బాలరాజు, అల్లి శీన, ఆదిల్ ,మంజునాథ్, సురేష్, వైద్యులు రామకృష్ణ, రవిశంకర్ పాల్గొన్నారు.